క్లుప్తంగా

ఆశీర్వదిస్తే అండగా ఉంటా



రామగిరి/కమాన్‌పూర్: ఎంపీగా ఆశీర్వదిస్తే అండగా ఉంటానని కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. రామగిరి మండలం సెంటనరీకాలనీ, కమాన్‌పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తామన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్, రామగిరి, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీనుబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రోడ్డ బాపన్న, ఎంపీపీ ఆరెల్లి దేవక్కతోపాటు కమాన్‌పూర్ మండలానికి చెందిన నాయకులు వైనాల రాజు, ఇనగంటి భాస్కర్‌రావు, కోలేటి మారుతి, ఆకుల ఓదెలు, కట్కం రవీందర్ పాల్గొన్నారు.

స్కూల్‌లో నృత్య దినోత్సవం



పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రగతినగర్‌లో సోమవారం టిక్నో డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రపంచ నృత్యదినోత్సవం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుడు కృష్ణ కేక్ కట్ చేయగా, చిన్నారులు నృత్యాలతో ఆకట్టుకున్నారు.

ఐవోసీ డీఎంకు సన్మానం



రామగుండం: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు బదిలీపై వచ్చిన డిపో మేనేజర్ ఆసిఫ్ అహ్మద్‌ను సోమవారం సీఐటీయూ అనుబంధ తెలంగాణ పెట్రోలియం–గ్యాస్ కాంట్రాక్టు వర్కర్స్, డ్రైవర్స్ అండ్ ఆల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ ప్రతినిధులు ఎం.రామాచారి, భిక్షపతి, ఆలేటి మోహన్, సంపత్, రవీందర్, మారుతి పాల్గొన్నారు.

నియామకం



ప్రవీణ్‌కుమార్

గోదావరిఖనిటౌన్: నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూవ్‌మెంట్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా కటుకు ప్రవీణ్‌కుమార్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ మహేందర్, లీగల్ సెల్ అధ్యక్షుడు కిరణ్‌జీ ప్రకటనలో తెలిపారు. నియామకానికి సహకరించిన జాతీయ, జిల్లా నాయకులకు ప్రవీణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు సమస్యలను కమిటీ దృష్టికి తీసుకువస్తే న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

సుల్తానాబాద్: పూసాలకు చెందిన పురం ప్రేంచందర్‌రావు బీఆర్‌ఎస్‌కు, మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌కు రాజీనామా పత్రాలు పంపినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తీరు నచ్చకే పార్టీ వీడుతున్నట్లు తెలిపారు. కాగా మంత్రి శ్రీధర్‌బాబుతో సన్నిహిత సంబంధాలుండడంతో.. కాంగ్రెస్‌లో చేరొచ్చనే అభిప్రాయాలు వినబడుతున్నాయి.

లో వొల్టేజీ సమస్య పరిష్కారం

గోదావరిఖనిటౌన్: నగరంలోని సంజయ్‌నగర్ ఏరియా పరిధిలో రెండు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో అధిక లోడు కారణంగా లో వోల్టేజీ సమస్యలు తలెత్తేవి. స్థానిక కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని ప్రకాశ్ సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సోమవారం 100కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా 11వ డివిజన్ ప్రజలు విద్యుత్ అధికారులు ఏడీఈ, ఏఈలకు కృతజ్ఞతలు తెలిపారు.

సింగిల్‌విండో డైరెక్టర్ మృతి

ధర్మారం(ధర్మపురి): పత్తిపాక సింగిల్‌విండో డైరెక్టర్, కమ్మరిఖాన్‌పేట గ్రామానికి చెందిన గుజ్జుల రాజనరేందర్‌రెడ్డి ఉరఫ్ రాజు(48) సోమవారం హఠాత్తుగా మరణించారు. ఆయన కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణారెడ్డికి రాజుకు సోదరుడు. మృతదేహాన్ని కరీంనగర్ నుంచి స్వగ్రామం కమ్మరిఖాన్‌పేటకు తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

కొప్పుల కోసం ప్రచారం

గోదావరిఖని: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం నాయకులు పీటీస్వామి, నడిపెల్లి మురళీధర్‌రావు ప్రచారం నిర్వహించారు. కొప్పుల ఈశ్వర్ పేరుతో ముద్రించిన కరపత్రాలను స్థానిక ప్రధాన చౌరస్తాలోని కులవృత్తుల వారికి పంపిణీ చేశారు.

ఉపాధి కల్పనే కాంగ్రెస్ లక్ష్యం

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: నిరుద్యోగులకు ఉపాధి కల్పన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం 11,12,13,33 డివిజన్ల కార్నర్‌మీటింగ్‌లో మాట్లాడారు. పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ ప్రజలకు చేసిందేమి లేదని, ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ అమలు చేస్తుందన్నారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్ట్ లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు నెరవేర్చామన్నారు. మిగతా ఒకటికూడా త్వరలోనే అమలు చేస్తామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. 42వ డివిజన్ కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్మికులు గురియాల మధు, గండు తిరుపతి, ఉప్పు కుమార్, మార్కం నరసయ్య, డప్పు మల్లేశ్, నల్లల సంజు, ఇల్లుటం రమేశ్, శ్రీకాంత్, రవి, ఓదెలు, శ్రీనివాస్, సమ్మిరెడ్డి, బాలాజీ సాంబయ్య, నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, మారెల్లి రాజిరెడ్డి పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు

రామగుండం: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అర్హులకు సంక్షేమ పథకాలు అందుతాయని, పార్లమెంట్ ఎన్నికల్లో వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సతీమణి మనాలిఠాకూర్ కోరారు. అంతర్గాం మండల పరిధిలోని విసంపేట గ్రామంలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఎల్లంపల్లి ప్రాజెక్టు టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దుతామని, ప్రతీ చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తామన్నారు. అంతర్గాం మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధి మడ్డి తిరుపతిగౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు బర్పటి శ్రీనివాస్, బోడకుంట సంతోష్, దారవేణి సాయికుమార్ తదితరులున్నారు.

ఇంటింటి ప్రచారం..

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ, పోతనకాలనీ 17, 19 డివిజన్లలో కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. గడ్డం వంశీకృష్ణను గెలించించాలని కోరారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ సాగంటి శంకర్, రాములు, తిరుపతిరెడ్డి, కుమార్, రజిత, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

జ్యోతినగర్ : అసంఘటిత, సంఘటిత రంగ కార్మిక సంఘం(కాంగ్రెస్) జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ అహ్మద్ బాబాను నియమించారు. ఈమేరకు రామగుండం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ సోమవారం నియామక పత్రాన్ని అందించారు. ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనికి చెందిన సయ్యద్ అహ్మద్‌బాబా.. కార్మికులకు అందిస్తున్న సేవలు గుర్తించి ఈ పదవి ఇచ్చినట్లు పేర్కొన్నారు.

హామీలు గ్యారంటీగా అమలు చేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో అరాచక పాలనను సాగించి ప్రజాధనాన్ని దోచుకున్న బీఆర్‌ఎస్ పార్టీని బొందపెట్టిన రీతినే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. నిమ్మనపల్లి, నిట్టూరు, తుర్కలమద్దికుంట, కాసులపల్లి, పాలితం, గోపయ్యపల్లి గ్రామాల్లో సోమవారం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, నాయకులు నర్సింహారెడ్డి, ఎడెల్లి శంకర్, రాజేందర్, తుల మనోహర్‌రావు, సజ్జద్, ఆంజనేయరావు, రాజయ్య, గిర్నేని సంపత్‌రావు, శ్రీనివాస్, మల్లారెడ్డి, మహేందర్, రాకేశ్, తిరుపతి, రాజయ్య, అనిల్, సునిల్, శ్రీధర్ తదితరులున్నారు. అదేవిధంగా పెద్దపల్లి శాంతినగర్‌లో ఎమ్మెల్యే విజయరమణారావు వంశీకృష్ణకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. నాయకుడు ముడుసు సాంబిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జంపయ్య, కోటేశ్వర్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలి

ఓదెల: కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి కోరారు. సోమవారం గుంపుల గ్రామంలోని ఉపాధి కూలీల వద్ద ఎన్నికల ప్రచారం చేశారు. పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, ఎంపీటీసీ తిప్పారపు సంపత్, నాయకులు మహేందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

వంశీకృష్ణను గెలిపిద్దాం..

కాల్వశ్రీరాంపూర్: కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణకు అత్యధిక మెజారిటీ ఇవ్వాలని మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్ కోరారు. కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు గాజనవేన సదయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆప్కాబ్ మాజీ చైర్మన్ చేతి ధర్మయ్య, పందిల్ల ఎంపీటీసీ రావి సదానందం, తులా మనోహర్‌రావు, ఈద సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

పెద్దపల్లిరూరల్: మండల రేషన్ డీలర్లు సోమవారం పట్టణంలోని శ్రీసీతారామస్వామి ఆలయంలో సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు బండారి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మద్దెల నర్సయ్య సమక్షంలో జరిగిన సమావేశంలో మండల అధ్యక్షుడిగా ఎలబోతారం శంకర్, ఉపాధ్యక్షులుగా గాండ్ల రవికుమార్, సలేంద్ర పద్మ, ప్రధాన కార్యదర్శిగా గుజ్జుల రవీందర్, ప్రచార కార్యదర్శిగా బండ సంతోష్, కోశాధికారిగా పద్మావతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బుషణవేని సురేశ్‌గౌడ్ వ్యవహరిస్తారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో మేడే విజయవంతం కోసం ముద్రించిన పోస్టర్లను సోమవారం పెద్దపల్లిలో ఆవిష్కరించారు. నాయకులు పద్మారావు, అంజయ్య, రాములు, లక్ష్మణ్, శంకర్, చంద్రమౌళి, ప్రతాప్ తదితరులున్నారు.

'ప్రజాస్వామ్యానికే ప్రమాదం'

పెద్దపల్లిరూరల్: కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ప్రముఖ కవులపై ఫాసిస్టు మూకలు అల్లరి సృష్టించి భౌతిక దాడులకు దిగి గాయపర్చడాన్ని ఖండిస్తున్నామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా విప్లవ రచయితల సంఘం కన్వీనర్ బాలసాని రాజయ్య అన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి చెలరేగిన మంటలు

ఓదెల: కొలనూర్ శివారులోని పంట పొలాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సోమవారం మంటలు వచ్చాయి. దీంతో కొంగర సమ్మయ్యకు చెందిన మొక్కజొన్న, ఉప్పు సంపత్, తాళ్ల రవి, తిరుపతి, సంపత్, ఉప్పు కొంరయ్యకు చెందిన పశుగ్రాసం, ఏడుమ్యాకల కొంరయ్యకు చెందిన పైపులు దగ్ధమయ్యాయి. సమీప రైతులు వెంటనే చేరుకొని మంటలార్పారు.

మహిళా చట్టాలపై అవగాహన

పెద్దపల్లిరూరల్: భోజన్నపేటలో సోమవారం ఉపాధిహామీ కూలీలకు మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై జెండర్ స్పెషలిస్టు స్వప్న అవగాహన కల్పించారు. బేటీ బచావో.. బేటీ పడావో, మహిళా హక్కులు.. చట్టాలు, అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన టోల్‌ఫ్రీ నంబర్లు, సఖి కేంద్రం సేవలు, లేబర్‌కార్డు ప్రాధాన్యం, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాల వల్ల కలిగే లబ్ధి, ప్రమాద బీమా తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు స్వప్న తెలిపారు. పంచాయతీ కార్యదర్శి దివ్య ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

ఓదెల: జీలకుంట, ఇందుర్తి, గుంపుల, శానగొండ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పెద్దపల్లి ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అసిస్టెంట్ ఆఫీసర్ గంగయ్య సందర్శించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

కాల్వశ్రీరాంపూర్: వేసవిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య సూచించారు. తహసీల్దార్ జాహెద్‌పాషా, ఎంపీవో గోవర్ధన్, ఆర్ఐ పాల్గొన్నారు.

స్తంభం తొలగించకుండానే సీసీరోడ్డు వేశారు



రోడ్డు మధ్య స్తంభం

ఫెర్టిలైజర్‌సిటీ: ఎల్కలపల్లి గేట్‌లో రామగుండం నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాన్ని అలాగే ఉంచి సీసీ రోడ్డు వేశారు. నడవడానికి, వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. స్తంభాన్ని తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

సదుపాయాలు కల్పించాలి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి, ముర్మూర్,అంతర్గాం గ్రామాలను సోమవారం ఎంపీడీఓ ఎంఏ.అలీం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ(ఏఏపీసీ)ల నిర్వహణ బాధ్యతలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించి మే పదిలోగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఇతరత్రా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లోని నర్సరీల నిర్వహణ తదితర విషయాలపై నర్సరీ నిర్వాహకులకు సూచనలు, సలహాలిచ్చారు.

3న హోం ఓటింగ్

రామగుండం: పార్లమెంట్ ఎన్నికలు మే 13న జరగనున్న నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మే 3వ తేదీన 85 ఏళ్ల పైబడి, నడవలేనివారి వద్దకు ఎన్నికల అధికారులు నేరుగా వెళ్లి వారితో ఓటు వేయించనున్నారని రామగుండం తహసీల్దార్ గెరివేణ కుమారస్వామి తెలిపారు. సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలని, ఎన్నికల సామగ్రితో ఓటర్ల ఇళ్లకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. పెద్దపల్లి లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 15,96,430 మంది ఓటర్లు ఉన్నారు. రామగుండం నియోజకవర్గ పరిధిలో 2,412 మంది వికలాంగులు ఉండగా 348 మంది నడవలేరని వారు ఇంటి వద్దనే ఓటుహక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు.

యాదవుల సంక్షేమానికి ప్రాధాన్యం

- యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం



నినాదాలు చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రప్రభుత్వం యాదవ సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతోపాటు సంఘ అభ్యున్నతికి సహకారం అందిస్తోందని అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ సందనవేన రాజేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం యాదవులు అన్నిరంగాల్లో ఎదగడానికి సహకారం అందిస్తారనే విశ్వాసంతో ఉన్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. యాదవసంఘ నాయకుడు మారం తిరుపతి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ నాయకులను ఇబ్బంది పెట్టే రీతిన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆయనను సంఘం బాధ్యతల నుంచి తొలగించామని తెలిపారు. ఇకనుంచి తిరుపతి తీసుకునే నిర్ణయాలు ఆయన వ్యక్తిగతమని, సంఘానికి సంబంధం ఉండదన్నారు. సమావేశంలో మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య, నాయకులు ఓదెలుయాదవ్, దారవేన నర్సింహయాదవ్, సంపత్, కొమురయ్య, మల్లయ్య, మల్లేశ్, కొండ రవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనతోనే గ్రామాల అభివృద్ధి

- పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్



ప్రచారం చేస్తున్న గోమాస శ్రీనివాస్, సునీల్‌రెడ్డి

మంథని: గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆదరించాలని పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ కోరారు. సోమవారం గుంజపడుగు గ్రామంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బలహీనవర్గాల బతుకులకు బీజేపీతోనే భరోసా ఉంటుందని అన్నారు. ధనవంతుల, కుటుంబ రాజకీయాలకు స్వస్తి పలకాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు కాసిపేట శివాజీ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బండి దేవేందర్, మండల అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్, నాయకులు చిదురాల మధూకర్, నారమల్ల కృష్ణ, రేపాక శంకర్ తదితరులు ఉన్నారు.

మార్పు కోసం పాట పాడాలి

జ్యోతినగర్: కళాకారులు సమాజ మార్పు కోసం పాటలు పాడాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు నంది రామన్న అన్నారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం యూనియన్ కార్యాలయంలో కొట్టె తిరుపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అరుణోదయ సాంస్కృతిక సమైక్య ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాకారులు అనేక పోరాటాల్లో తమ గొంతుతో శ్రమజీవుల హక్కుల కోసం పాటలు పాడారని తెలిపారు. సాయుధ రైతాంగ పోరాటం నుంచి తెలంగాణ ఉద్యమం వరకు కళాకారులు క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రస్తుతం మతతత్వ, కులతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా గొంతెత్తి ప్రజల పక్షాన పాట వినిపించాలని అన్నారు. సమాజ మార్పు కోసం ప్రగతిశీలవాదులు, కళాకారులు, మేధావులు ఐక్యంగా పోరాడాల్సి ఉందని అన్నారు. సమావేశంలో వేముల లచ్చయ్య, గొర్రె చందు, లింగయ్య, తిరుపతి, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నిజాయతీగా ఓటు వేయండి



ప్రతిజ్ఞ చేయిస్తున్న నగరపాలక కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ: నిజాయతీగా ఓటు వేయాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సీ.హెచ్.శ్రీకాంత్ కోరారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం గోదావరిఖని బస్టాండ్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరం అందరితో ఓటుహక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో ప్రదర్శన ఇచ్చారు. నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ మనోహర్, సీనియర్ అసిస్టెంట్ పబ్బాల శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్ అశోక్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ విష్ణుప్రియ, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

'దళితులను మోసం చేసిన బీజేపీ'



మాట్లాడుతున్న నాయకులు

మంథని: బీజేపీ దళితులను మోసం చేసిందని, వర్గీకరణ అమలు చేస్తామని మాయమాటలు చెప్పిందని, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకే తమ మద్దతు అని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్, నియోజకవర్గ ముఖ్య నాయకుడు తోకల మల్లేశ్ అన్నారు. సోమవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబు పిలుపు మేరకు వంశీకృష్ణకు మద్దతు ఇస్తున్నామన్నారు. దళితుల అభివృద్ధికి కాకా కుటుంబం పనిచేస్తుందని తెలిపారు. గత ఎన్నికల హామీలను బీజేపీ నిలబెట్టుకోలేదని, మళ్లీ మాదిగలను ఓట్లు అడిగే హక్కు కోల్పోయిందని అన్నారు. మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్లూరి శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ కండె కుమారస్వామి, నాయకులు మంథని కర్ణకృష్ణ, కాసిపేట సాంబయ్య, రొడ్డ లింగయ్య, గాడెపు బానేశ్, రొడ్డ రాజేశ్వర్‌రావు, జాడి జంపన్న, రేగుంట లింగయ్య, కాసిపేట ప్రశాంత్, గాడెపు మనోజ్ పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులను కట్టడి చేయాలి

గోదావరిఖని: వరంగల్‌లో లౌకిక రచయితల ఫోరం రాష్ట్ర సదస్సుపై ఏబీవీపీ దాడిని అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం(అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ తీవ్రంగా ఖండించారు. బ్యానర్లు చించేసి రచయితలను దుర్భాషలాడుతూ భౌతిక దాడికి దిగిన మతోన్మాద ఏబీవీపీ చర్యలను ప్రతిఒక్కరు ఖండించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలో మతోన్మాద ఫాసిస్టు శక్తులు మతాల పేరిట లౌకిక వ్యవస్థను, ప్రజాస్వామ్య భావస్వేచ్ఛను కాలరాస్తున్నాయన్నారు. కలిసి బతికే మనుషుల మధ్య చీలికలు తీసుకువస్తున్నాయన్నారు. మతోన్మాద ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులను రాష్ట్ర ప్రభుత్వం కట్టడి చేయాలన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



జూలపల్లి: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సోమవారం జూలపల్లిలో కాలువ పూడికతీత పనులను ఏపీవో సదానందం పరిశీలించి తగిన సూచనలు చేశారు.

దాహం తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు

సుల్తానాబాద్: ప్రయాణికులు, ప్రజలకు దాహాన్ని తీర్చేందుకే చలివేంద్రం, మజ్జిగ కేంద్రం ఉపయోగపడుతుందని తాళ్లపల్లి ఆగయ్య ఫౌండేషన్ చైర్మన్ తాళ్లపల్లి మనోజ్‌గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద మజ్జిగ, చలివేంద్రాన్ని ప్రారంభించారు. రఫీక్, తుమ్మ రాజుకుమార్, జూపాక కుమారస్వామి, దున్నపోతల మధు, దేశెట్టి రమేశ్, నాంపల్లి, రమేశ్, అంజనేయులు పాల్గొన్నారు.

నేడు పౌర హక్కుల దినోత్సవం

జూలపల్లి: వడ్కాపూర్‌లో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బషీరుద్దీన్ తెలిపారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

గోశాలకు పశుగ్రాసం



సుల్తానాబాద్: శ్రీధర్మశాస్త్ర గోశాలలోని గోవులకు పశుగ్రాసాన్ని యువ న్యాయవాది ఆవుల శివకృష్ణ–సతీమణి సమత కూతురు అంజన పుట్టిన రోజు సందర్భంగా విరాళంగా సోమవారం అందజేశారు. గోశాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బండారి సూర్య, జాకీ రమేశ్, నల్ల వెంకటేశ్, గుండా రవీందర్ పాల్గొన్నారు.

బగుళ్లగుట్టకు రోడ్డు వేయించిందే శ్రీధర్‌బాబు

ముత్తారం: మచ్చుపేట బగుళ్లగుట్ట దేవాలయం వరకు రూ.2కోట్ల నిధులతో సీసీ రోడ్డు వేయించింది మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అని మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు, మచ్చుపేట మాజీ సర్పంచ్ గోవిందుల పద్మఆనంద్ అన్నారు. సోమవారం మచ్చుపేటలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. మాజీ ఎంపీపీ గొర్ల రాజయ్య, మాజీ సర్పంచ్ మేడగోని సతీష్‌గౌడ్, నాయకులు తాళ్లపల్లి కుమార్‌గౌడ్, దుండె రాజేందర్, రాజేశం, దొంతల రాకేశ్, కలవేన దేవరాజ్, బక్కతట్ల రామ్మూర్తి తదితరులున్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మడం లేదు



కాల్వశ్రీరాంపూర్: బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ప్రజలు నమ్మడం లేదని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ అన్నారు. మాజీ జెడ్పీటీసీ దంపతులు లంక రాజేశ్వరి–సదయ్యల కూతురు వివాహానికి హాజరైన మోహన్.. కాల్వశ్రీరాంపూర్‌లో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు బాజీపటల్, అక్బర్, సురేందర్, మధుకర్ సతీష్, రాజయ్య, రమేశ్, ఐలయ్య పాల్గొన్నారు.

' కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు '

జూలపల్లి: అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో గుణపాఠం తప్పదని బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సంకెన్ల లక్ష్మణ్ అన్నారు. పెద్దాపూర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కరపత్రాలతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, అంజయ్య, ఆరకుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లిలో ఎన్నికల ప్రచారం



కమాన్‌పూర్: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని జూలపల్లిలో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ రాసకొండ లక్ష్మి, ఉప్పరి శ్రీనివాస్, మేకల సంపత్‌యాదవ్, బొమ్మగాని అనిల్, పాన్నం రాజేశ్వరి, గుర్రం లక్ష్మిమల్లు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

పాలకుర్తి: బసంత్‌నగర్, కుక్కలగూడూర్, వేంనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సోమవారం ఎన్నికల పరిశీలకుడు రవీశ్‌గుప్తా తనిఖీ చేశారు. తాగునీరు, టాయిలెట్స్, దివ్యాంగుల సౌకర్యార్థం వీల్‌చైర్ వంటి సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే బీఎల్‌ఓల పనితీరును అడిగి తెలుసుకున్నారు. వెంట మండల ఆర్ఐ. భానుకుమార్, బసంత్‌నగర్ ఎస్సై స్వామిలు ఉన్నారు.

పోలింగ్ స్లిప్పుల పంపిణీ

ఎలిగేడు: ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 12 గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ బీఎల్‌వోలు ఓటరు సమాచార చీటీలను పంపిణీ చేస్తున్నారు.